క్లుప్తంగా

సిబ్బందికి యూనిఫాం పంపిణీ



సిబ్బందికి యూనిఫాం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్‌లోని చివరి తరగతి సిబ్బందికి శుక్రవారం యూనిఫాం అందజేశారు. జెడ్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న యూనిఫాంను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏకరూప దుస్తులు అందరినీ ఐక్యంగా ఉంచేందుకు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కార్యాలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి, పలువురు జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి



ఎమ్మెల్యే నానిని కలిసిన ఏలూరు సీసీఎస్ ఎస్సై శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్): సమర్థవంతంగా విధులు నిర్వహించడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని సూచించారు. సీసీఎస్ ఎస్సైగా నియమితులైన బి.శ్రీనివాసరావు శుక్రవారం నానిని మర్యాద పూర్వకంగా ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ప్రజలకు పోలీస్ వ్యవస్థపై గౌరవం పెరిగే విధంగా పనితీరు ఉండాలని నాని సూచించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు నానికి పూలబొకెను అందజేశారు.

సీఆర్‌ఆర్ పీజీ ఫలితాల విడుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాలలో 2022–23 సంవత్సరానికి సంబంధించి పీజీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను కరస్పాండెంట్లు కేవీస్ విష్ణుమోహన్, కానాల శ్రీనివాసరావు శుక్రవారం విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు మాట్లాడుతూ పరీక్షా ఫలితాలను సీఆర్‌ఆర్ కళాశాల వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్‌తో పాటు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.విశ్వేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ వీఆర్‌ఎస్ బాబు యలమర్తి అభినందించారు.

అమ్మవార్ల ఆలయాల్లో సరస్వతీదేవి పూజలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీ దేవిగా పూజలందుకున్నారు. మూలా నక్షత్రం పర్వదినం సందర్భంగా ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు సరస్వతీ దేవి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులతో సామూహిక సరస్వతీ దేవి పూజలు, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నగరంలో వివిధ ప్రాంతాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో నిత్యపూజలు, కుంకుమ పూజలు, లలితా సహస్రనామ పారాయణలు, దేవీ ఖడ్గమాల పారాయణ చేశారు. పవర్‌పేటలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి అలంకార పూజలు, భక్తుల గోత్ర నామాలతో సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి మహాసరస్వతీ దేవి అలంకరణ చేశారు. విద్యార్థులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవర్‌పేట వాసుదేవాలయం ప్రాంగణంలోని రాజ్యలక్ష్మి అమ్మవారికి ఉదయం క్షీరాభిషేకం, విశేష పూజలు, నిత్య పూజలు చేశారు. అమ్మవారికి మహాసరస్వతీ దేవి అలంకరణ చేశారు. రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో అమ్మవారికి సరస్వతీ దేవి అలంకరణ చేసి తామరపూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నగరానికి చెందిన సంగీత కళాకారుల ఆధ్వర్యంలో గాత్ర కచేరి నిర్వహించారు. గాయకులకు పరిమి సావిత్రి వయోలిన్, గంగాభవాని వీణ, సీహెచ్ కళ్యాణ్ కుమార్ మృదంగంతో వాద్య సహకారం అందించారు. పత్తేబాద కనక దుర్గ ఆలయంలో అమ్మవారికి సరస్వతీ దేవి అలంకరణ చేశారు సామూహిక అక్షరాభ్యాస పూజలు నిర్వహించారు. అగ్రహారంలోని శ్రీ సూర్య రెసిడెన్సీలో నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి సరస్వతీ దేవి అలంకరణ చేసి విశేష కుంకుమ పూజలు చేశారు. తూర్పువీధి గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజు బాబు ఆలయ ప్రాంగణంలో దసరా మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి సరస్వతీ దేవి అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. 108 మంది బాలలతో సామూహిక అక్షరాభ్యాస పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంకినేని భాను ప్రకాష్ బాలలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.



సరస్వతీ దేవి అలంకరణలో పత్తేబాద కనకదుర్గమ్మ



అగ్రహారం సూర్య రెసిడెన్సీలో సరస్వతీ దేవి



సరస్వతీ దేవి అలంకరణలో తూర్పువీధి గంగానమ్మ



తూర్పువీధి గంగానమ్మ ఆలయంలో సరస్వతి పూజ చేస్తున్న చిన్నారులు

పోషకాహారం పంపిణీ



పోషకాహారం అందజేస్తున్న నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): మానవత ఆధ్వర్యంలో 25 మంది చిన్నారులకు పోషకాహారం అందజేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న ఆర్‌బీఎస్‌కే సెంటరులో శుక్రవారం పోషకాహారాన్ని అందజేశారు. మానవత జిల్లా కేంద్ర నియంత్రణ, విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు సౌజన్యంతో పోషకాహారాన్ని నందిగం దివ్యశ్రీ సాకారంతో భోజనాలను అందించారు. మేడికొండ సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని మేడికొండ పద్మజ చిన్నారులకు పండ్లు, స్వీట్లు అందించారు. కార్యక్రమంలో మానవత ఏలూరు నగర అధ్యక్షుడు మేతర అజయ్‌బాబు, రీజియన్ చైర్మన్ పోలవరపు దేవరత్నాకరరావు, ఏలూరు మండల చైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల, కోశాధికారి అల్లూరి మోహిని, సంయుక్త కార్యదర్శి వల్లూరుపల్లి సాయిసుధ, డాక్టర్ శాస్త్రి, డాక్టర్ బ్యూలా, వైఆర్‌జీ జిల్లా కోఆర్డినేటర్ శివ తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

ఏలూరు రూరల్: ది ఏలూరు ఆటోమొబైల్ మోకానిక్స్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కర్రి నాగేశ్వరరావు (అరుణతార), ఉపాధ్యక్షుడిగా కర్రి ఈశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రొసైడింగ్ ఆఫీసర్లుగా న్యాయవాదులు ఆలతి శ్రీనివాసరావు, చదలవాడ వెంకటరమణ సాయంత్ర 5 గంటలకు ఫలితాలు వెల్లడించారు. గన్‌బజార్‌లో నబి క్రిస్టల్ కళ్యాణ మండంలో 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తంగా 312 ఓట్లకు 214 పోలయ్యాయి. పుప్పాల ముకుందరావుతో పోటీపడిన నాగేశ్వరరావుకు 195 ఓట్లు పోలయ్యాయి. బేతపూడి కిరణ్‌కుమార్‌తో పోటీపడిన ఈశ్వరరావుకు 190 ఓట్లు పోలయ్యాయి. కార్యదర్శిగా ఆడపా సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా మద్రాపు సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు వెల్లడించారు. పాలకవర్గం 2023 నుంచి 2028 వరకు ఐదేళ్ల పాటు కార్యకలాపాలు నిర్వహించనుంది. 23 ఏళ్ల అధ్యక్షుడిగా వ్యవహరించిన మాగంటి నాగభూషణంకు ఈ ఎన్నికతో చెక్ పడింది.

ఉత్కంఠం

కొద్దిరోజులుగా ఏలూరులో ఆటోనగర్ ఎన్నికలు ఉత్కంఠ రేపాయి. మొదట అసోసియేషన్ సభ్యులచే ఏర్పడ్డ త్రిసభ్య ఎన్నికల కమిటీ ఈ నెల 9న నోటిఫికేషన్ జారీ చేసింది. స్క్రూటినీ సమయంలో మాజీ అధ్యక్షుడు నాగభూషణం వర్గానికి చెందిన పలువురు నామినేషన్లు చెల్లవని కమిటీ ప్రకటించడంతో వివాదం తలెత్తింది. 13వ తేదీన ఆటోనగర్‌లో చేపట్టిన పోలింగ్ ప్రక్రియను కొందరు వ్యక్తులు అడ్డుకున్నారు. దీంతో పంచాయితీ స్థానిక ప్రజాప్రతినిధుల వద్దకు చేరింది. శుక్రవారం పోలీసుల పహారా మధ్య పోలింగ్ సజావుగా జరిగింది.

వివాదాలమయం

1983లో ఆటోనగర్ ప్రారంభమైంది. నాటి నుంచి నేటి వరకూ అనేక వివాదాలు కొనసాగుతున్నాయి. ఏపీఐఐసీ పరివేక్షణలో ఆటోనగర్ కోసం 54 ఎకరాల భూమిని ప్రభుత్వం అసోసియేషన్‌కు కేటాయించింది. ఈ మొత్తం భూమిని అసోసియేషన్ సుమారు 500 ప్లాట్లుగా విభజించి సభ్యులకు వారీ ట్రేడ్స్ ఆధారంగా పంపిణీ చేసింది. నాటి నుంచి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న నాగభూషణం పదుల సంఖ్యలో స్థలాలను తన అనుయాయులకు కట్టబెట్టారని సభ్యులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. వారు విచారణ చేశారు. 3000 వేల గజాల ఆటోనగర్ ఎమినిటీ స్థలం కబ్జా చేసి భారీ కాంప్లెక్స్ నిర్మించాడంటూ మరో సభ్యుడు సులేమాన్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో అసోసియేషన్ వ్యవహారంలో ఐపీఐఐసీ అధికారులు తలదూర్చడం లేదు. నేటికీ పదుల సంఖ్యలో వర్కింగ్ మెకానిక్స్ ఆటోనగర్‌లో స్థలాలు అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు.



ఆటోనగర్ ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తున్న ప్రొసీడింగ్ ఆఫీసర్



ఆటోనగర్ అధక్షుడుగా ఎన్నికైన కర్రి నాగేశ్వరరావు

22న సామాజిక న్యాయ బస్సు యాత్ర సభ

ఏలూరు (టూటౌన్): ఆంధ్రరాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా దళిత వర్గాలకు పెద్దపీట వేసి, ప్రభుత్వంలో అధిక భాగస్వామ్యం కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీకి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఈ నెల 22న ఏలూరులో నిర్వహించే సామాజిక న్యాయ బస్సు యాత్రకు సంబంధించి వైఎస్సార్ సీపీ నేత, జాతీయ ఎస్సీ నాయకుడు పాలిమేర హరికృష్ణ రూపొందించిన పోస్టర్‌ను శుక్రవారం నాని విడుదల చేసి మాట్లాడారు. పేదలు, దళితుల పట్ల జగనన్న ఆలోచన విధానాన్ని ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగానికి చెందిన పార్టీ రథసారథులు, కోస్తా ఆంధ్ర జిల్లాల పార్టీ ఎస్సీ విభాగం ముఖ్య నాయకులతో సామాజిక బస్సు యాత్రకు సంబంధించిన సన్నాహక సభను ఈనెల 22న ఏలూరులో నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిళ్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఏపీ మెడికల్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ దిరిశాల వరప్రసాద్, డిప్యూటీ మేయర్ ఎన్ సుధీర్ బాబు, కార్పొరేటర్లు మున్నుల జాన్‌గురునాథ్, సుంకర చంద్రశేఖర్, ఎర్రంశెట్టి సుమన్, కల్వకొల్లు సాంబశివరావు, నాయకులు కొత్తపల్లి బాబూరావు, కొల్లిపర సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు యాత్ర పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే నాని

డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఆటో, మోటార్ వాహన డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ అనుబంధ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్ ఏలూరు నగర అధ్యక్షులు పుప్పాల కన్నబాబు కోరారు. స్థానిక త్రిచక్ర ఆటో స్టాండ్ వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కన్నబాబు మాట్లాడారు. ఆటో, మోటారు వాహనాలపై పెనాల్టీలు పెంచుతూ విడుదల చేసిన జీఓ 21, 31 రద్దు చేయాలన్నారు. ఈ చలానాలు రద్దు చేసి డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని కోరారు. డీజిల్, పెట్రోలు, గ్యాస్ ధరలను తగ్గించాలని, ప్రమాదల నివారణ పేరుతో కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ నెంబర్ 894ను రద్దు చేయాలని, పెంచిన థర్డ్‌పార్టీ బీమా, రోడ్ టాక్స్, గ్రీన్ టాక్స్, టాటా మ్యాజిక్ ప్యాసింజర్ వ్యాన్లకు లేబర్ ట్యాక్స్‌లను రద్దు చేయాలని కోరారు. ఏలూరులో పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, డ్రైవర్లకు ఉచిత బీమా పాలసీలను అమలు చేయాలని కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	23
డీ.తిరుమల ఏలురు బీహెచ్‌ఈఎల్	22.15	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	23
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	19
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	15
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	207
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	25
ఏలూరు -తిరుపతి	16.00	4830	రద్దు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	22	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	38
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05–08
బెండకాయలు	20	కంద	50
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	38
కాకర కాయలు	24 – 28	కీరా దోస	40
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	84
క్యాబేజీ	20	అల్లం	130
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	35
దొండకాయలు	20	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	38	తోటకూర	10
గోరుచిక్కుడు	24	గోంగూర	06
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30
		నిమ్మకాయలు (డజను)	--

గ్రంథాలయాలకు పుస్తకాల అందజేత



గ్రంథాలయ సంస్థ చైర్మన్ పద్మశ్రీకి పుస్తక ప్రతులు అందిస్తున్న రచయిత ఆదిబాబు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆదిబాట శతకము, హనుమ శతకము అనే రెండు పుస్తకాల ప్రతులను రచయిత, చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వానపల్లి ఆదిబాబు శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీకి అందజేశారు. ఆయన రచించిన సుమారు రూ.7 వేల విలువైన 150 ప్రతులను జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో పాఠకులకు అందుబాటులో ఉంచాలని ఆదిబాబు కోరారు. చీర్ల పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు, యువత పుస్తక పఠనానికి సమయం కేటాయించాలని, ఆధ్యాత్మిక పుస్తకాల పఠనం ద్వారా దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక చరిత్ర తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తోన్న దసరా విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో దేశభక్తి గీతాలు పాడించారు. నృత్యాల్లో శిక్షణ ఇచ్చారు. సరస్వతీ దేవి విగ్రహానికి పూజలు చేశారు. డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేతో ప్రజలకు మేలు

ఏలూరు రూరల్: గ్రామాల్లో చేపట్టిన స్వామిత్వ (సర్వే ఆఫ్ విలేజ్ అబాడి, మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజడ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియా) వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఏలూరు రూరల్ మండల ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి అన్నారు. శుక్రవారం ఆమె చాటపర్రులో సచివాలయ సిబ్బందితో కలిసి ఇళ్ల సర్వే చేపట్టారు. గ్రామాల్లో ఇళ్లు, భూమి విస్తీర్ణం సేకరించి స్వామిత్వ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నట్టు ఆమె చెప్పారు. గ్రామీణ ప్రజల ఇళ్లు, భూములపై సాంకేతికంగా పక్కా స మాచారం అందుబాటులోకి వస్తుందన్నారు. భవిష్యత్తులో గ్రామాభివృద్ధి, విస్తరణ, ప్రజల అవసరాలు, సౌకర్యాల ఏర్పాటుపై ప్రభుత్వానికి అవగాహన ఏర్పడుతుందని వివరించారు. మొత్తంగా 15 గ్రామాల్లో సచివాలయ, పంచాయతీ సిబ్బంది సర్వే చేస్తున్నారని చెప్పారు. పక్కా సమాచారంతో పంచాయతీ సిబ్బందికి సహకరించాలని ప్రజలను కోరారు.


పార్టీ విజయానికి కృషి చేయాలి



మాదేపల్లిలో గ్రామ కమిటీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు రూరల్ : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు రూరల్ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ సూచించారు. శుక్రవారం ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజుతో కలిసి ఆయన మాదేపల్లి, కాట్లంపూడి, జాలిపూడి, మాల్కాపురంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బాయ్యచౌదరి ఆదేశాల మేరకు పార్టీ గ్రామ కమిటీల ఏర్పాటుపై కసరత్తు చేపట్టామని ఆనంద్ చెప్పారు. ఎంపీపీ శ్రీనివాసరాజు, సీనియర్ నాయకుడు పీవీరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరింత క్రియాశీలంగా పని చేయాలని సూచించారు. సమావేశంలో కొరపాటి శ్రీరామ్‌ప్రభుదేవ్, పత్యాల సునీత, బొల్లిముంత రామ్మోహనరావు, నరహరిశెట్టి రాధాకృష్ణ, కోసూరి సుబ్బారావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై సైనిక దాడులను ఆపాలి



పాతబస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): పాలస్తీనాపై ఇజ్రాయేల్ సైనిక దాడులను నిరసిస్తూ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావులు మాట్లాడారు. పశ్చిమ ఆసియా ప్రాంతంలో ఒకప్పుడు దేశంగా లేని ఇజ్రాయేల్, తరువాత శరణార్థులుగా పాలస్తీనా ప్రాంతానికి వచ్చిందని గుర్తుచేశారు. ఒంటె గుడారం సామెత లాగా నేడు ఆశ్రయం కల్పించిన పాలస్తీనాపై దురాక్రమణకు దిగిందని, గాజాపై సైనిక దాడులు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిపై బాంబుల వర్షం కురిపించి 500 మంది రోగుల మృతికి కారణమైందన్నారు. అమెరికా తన ఆయుధాలను అమ్ముకోవడానికి ప్రపంచ వ్యాప్తంగా యుద్ధోన్మాదంతో ఇటువంటి యుద్ధాలను ప్రోత్సహిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు షేక్ హుస్సేన్, బద్ద వెంకట్రావు, మేతర అజయ్ బాబు, కె.లెనిన్, టాగూర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

పెదవేగి : జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని కేఆర్‌ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ అధికారులకు సూచించారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు బిల్లులను సకాలంలో అందించే ఏర్పాటు చేయాలని, అప్పుడే లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేస్తారని ఆయన చెప్పారు.

జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలోని ఎన్‌ఆర్‌పేటలో పేకాట శిబిరంపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌పేటలోని ఒక ఇంట్లో నిర్వహిస్తున్న పేకాటశిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.2900 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.